## రచనాభిమానులైన చందాదారులు తరచూ అడిగే ప్రశ్న...

## "మా చందా కాలపరిమితి ఎప్పుడు పూర్తవుతుంది.... ???"

**మీ చందా కాలపరిమితి పూర్తయిందని/పూర్తవుతోందని తెలుసుకోవడానికి సులువైన మార్గం:**

ప్రతీ నెలా మీరందుకునే 'రచన' సంచిక కవరు మీది మీ చిరునామా పైన మీ చందా సంఖ్యతో బాటుగా చందా పూర్తయ్యే/పూర్తయిన సంచిక సంఖ్య ఉంటుంది. ఈ సంఖ్యను మీరందుకున్న సంచిక సంఖ్యతో సరిచూసుకుంటే మీ చందా కాలపరిమితి ఏ సంచిక వరకూ ఉన్నదో / ఏ సంచికతో పూర్తయిందో తెలుస్తుంది. దాని ప్రకారం మీ చందా కాలపరిమితిని తగు విధంగా పొడిగించుకోవడానికి వీలవుతుంది.

**ఎందుకిలా... ?**

ఎప్పటికప్పుడు చందాదారులకి రిమైండర్లు పంపాలంటే శ్రమ, టైము సంగతి అటుంచితే పోస్టేజికి మాత్రమే కొన్ని వందల... వందల రూపాయలు వెచ్చించాల్సి వస్తుంది. అంత ఖర్చును 'రచన' భరించడం కష్టమన్నది రచనాభిమానులకు విదితమే కదా!... అందుకే ఈ ఏర్పాటు చేయడం జరిగింది. చాలామంది ఈ పద్ధతికి అలవాటు పడినా ఇంకా చాలామంది అలవాటు పడాల్సిన అగత్యముంది.

**'రచన'ను బహుమతిగా పొందుతున్న చందాదారులు :**

ఎందరో రచనాభిమానులు తమ బంధువులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు 'రచనను బహుమతిగా పంపమని చందా కడుతున్న విషయం అందరికీ విదితమే! వారు కట్టిన చందా కాలపరిమితి ముగిసిన మీదట 'రచన' అందుకుంటున్న వారు తమంత తామే చందా కాలపరిమితిని పొడిగించుకోవడం ధర్మం కదా!... కాబట్టి మళ్లీ మొదట కట్టిన వారే పొడిగింపు చందా కూడా కట్టాలనుకోకుండా ఆలోచించి తగు నిర్ణయం తీసుకోగలరు!

బకాయిదారులైన చందాదారులు :

**చందా కాలపరిమితి ముగిసిన చందాదారులు – కారణాలు ఏవైనాగానీ – పొడిగింపుకు అనుకూలురు కాకపోతే కనీసం ఆ విషయం మాకు తెలియజేస్తే ఇక మీదట వారికి పత్రిక పంపడం నిలుపు చేస్తాము.**

చెక్కులు/డి.డి.లు/ఎం.ఒ.లు పంపే చందాదారులకు సూచనలు :

– చెక్కుల మీద కేవలం **M/s. RACHANA** అని మాత్రమే రాయాలి. ముందుగానీ, తర్వతగానీ ఏవిధమైన విశేషణాలూ (**the Editor ; payable at Hyderabad ; Telugu monthly etc., etc.,**) రాయకూడదు. అలా రాసిన చెక్కులను బ్యాంకు అంగీకరించదు.

**- Payable at Hyderabad** అన్నది డి.డి.లకు మాత్రమే వర్తిస్తుందని గమనించగలరు.

– ఎం.ఒ.లలో అవి పంపేవారి వివరాలేమీ స్పష్టంగా పోస్టల్ వారు రాయరు. అంచేత ఎం.ఒ.లు పంపేవారు విధిగా పూర్తి వివరాలతో ఉత్తరం కూడా రాయాలి. ఉభయుల సౌలభ్యం కోసం అందరూ ఉత్తరాలలో తమ ఫోన్ నెం. రాయగలరు.

260 (జూలై, 2014) సంచిక వరకూ చందా కాలపరిమితి పూర్తయిన వారందరికీ ఆ వివరాలు తెలుపుతూ, ఎంత సొమ్ము పంపడం సమంజసమో సూచిస్తూ ఉత్తరాలు రాయడం జరిగింది. ఖర్చు తడిపి మోపెడయింది. అది వేరే సంగతి!

విదేశీ చందాదారులకు ఇలా రాయాలంటే ఖర్చు తడిపి 'మోపెడు'తో సరిపెట్టుకోదు - 'విమాన' మంతవుతుంది. ఆ కారణంగా వారంతా తమ ఇ-మెయిల్ 'ఐడి'లు తెలియజేస్తే బకాయి వివరాలు తెలియజేయగలమని మనవి.

ఈ విషయమై చందాదారులందరూ పెద్ద మనసు చేసుకుని తక్షణం స్పందించి, సహకరించగలరని ఆశిస్తూ...

– *సంపాదకుడు*

సంపుటి : 14
సంచిక : 4
జూలై : 2014

రచన ఇంటింటిపత్రిక

260

పేజీలు : 100
వెల : ` 30/-

ముఖచిత్రం :: "కాక్... కాక్... ఎండలు తగలబడి పోతున్నాయ్... కా...కా...కాక్..." :: చిత్రకారుడు : చంద్ర

చిరునామా : 1-9-286/2/ P ; "యడ్లపాటివారి ఇల్లు" ; విద్యానగర్ (రాంనగర్ గుండు దగ్గర);
హైదరాబాద్ - 500 044 :: ఫోన్ : 040 - 2707 1500
*email : rachanapatrika@hotmail.com, rachanapatrika@gmail.com : Visit : www.rachana.net*

సంపాదకీయం..... 5

ప్రత్యేక రచన
రావి శాస్త్రిగారి కథలు నాలుగు
– బీనాదేవి 7

## కథలు

మంచాన పడితే పడ్డాను – డి.ఆర్. ఇంద్ర 25
కథాపీఠం కథ ...
అమ్మా నువ్వెప్పుడొస్తావు? – సీతాసత్య 37
భ్రమ – వెల్చేరు చంద్రశేఖర్ 45
పగిడి – కె.బి. లక్ష్మి 50
ఆఫ్రికన్ కథలు :: వెర్రి వెంగళాయి డియోపుడు
– బిరగో డియోప్ :: కవన శర్మ 55
కాలచక్రం
– అపర్ణ మునుకుట్ల గునుపూడి 58
మన మర్యాద రామన్న – విజయ కర్రా 62
ఇదీ కారణం! *(చిన్న కథ)*
– కోనే నాగ వెంకట ఆంజనేయులు 73
*మారుతున్న కుటుంబ సంబంధాల కథల పోటీలో...*
*బహుమతి పొందిన కథ...*
మా ఇంటి మహాలక్ష్మి
–యన్.కె. నాగేశ్వరరావు 74
వాళ్లు ముగ్గురూ
– వెంపటి సుధాప్రసన్న 80

## సీరియల్ రచనలు

మరో పుష్కరమ్
– బి.వి.ఎస్. రామారావు 12
చిలకా ఎగిరిపో....!
– వసుంధర 85
అమెరి'కాకమ్మ'కబుర్లు
– వంగూరి చిట్టెన్ రాజు 96

## శీర్షికలు

కిరణ్‌ప్రభ కవిత – కరుణాకర్ రేఖాచిత్రం 6
పజిలింగ్ పజిల్ – 260
నిర్వహణ : 'విరించి' 8
సాహితీ వైద్యం
– వసుంధర 29

## అక్కడక్కడక్కడా

కార్టూన్లు

వచ్చే సంచికలో కథకులు...
విహిన మూర్తి
సాగి వర్మరాజు : జి.యస్. లక్ష్మి తదితరులు

The Views, Opinions expressed and Statements made by the Writers, Authors and Readers need not necessarily be those of the Editor and Management of Rachana Entinti Patrika. All disputes will come under the exclusive jurisdiction of respective Courts and Forums situated in Hyderabad City only.

**సలహాదార్లు**

కాళీపట్నం రామారావు
కవన శర్మ
అత్తలూరి నరసింహారావు
వసుంధర
కోడూరి శ్రీరామమూర్తి
కేతు విశ్వనాథరెడ్డి
డా. ఎన్. సురేంద్ర
వై. రాంబాబు & శాయి
డా. డి.వి.ఆర్. పూషా





**'రచన' కార్యాలయం**

**చిరునామా**
1-9-286/2/పి : విద్యానగర్
(రాంనగర్ గుండు దగ్గిర)
హైదరాబాద్ -500 044
ఫోన్ : 040 - 2707 1500

✪ ✪ ✪

*సంపాదకుడు*
**వై.వి.యస్.ఆర్.యస్.తల్పశాయి**
*అసోసియేట్ ఎడిటర్*
'హంసలేఖ'


***The Only Magazine Administered by Writers***

**మొ**న్న మొన్నటి దాకా ఎన్నికల హోరులో, ఎడా పెడా నాయకుల వాగ్దానాల ఉక్కపోతలో ఉక్కిరిబిక్కిరై శోషిల్లిన సగటు మనిషి...

ఆ మీదట ఒకటి రెండు కాగా ఇరు ప్రాంతాల నాయకుల అసంతృప్తి మాటల తూటాలకు అతలాకుతలం అయిపోతూ *'అసలు ఎటుపోతున్నాం మనం?'* అన్న మీమాంసలో పడి పోయారు.

ఎన్నికలప్పుడు ఎలుగెత్తి చాటిన 'రైతు రుణ మాఫీ' మీద రైతులు ఎన్ని ఆశలు పెంచుకున్నారో... ఇప్పుడు దాని అమలుకు ఎన్ని అడ్డంకులో...

'వాళ్లొప్పుకోలేదు, వీళ్లొప్పుకోలేదు – అయినా మాఫీ చేస్తాం ...చేసి తీరుతాం...'

కొన్ని కోట్లమంది పన్నుగా చెల్లించిన డబ్బులోంచి తీసి లక్షల మంది రైతుల రుణ మాఫీ చేస్తారు... 'ఎవడబ్బ సొమ్మని రామచంద్రా...' అని రామదాసు కీర్తన ఈ సందర్భంగా సగటు మనిషి తలపుల్లో మెదులుతుంది. 'టాక్స్ పేయర్స్ మనీ' అందరు ప్రజలకూ ఉపయోగపడే కార్యక్రమాలకు ఉపయోగింపబడాలి కదా! ఎన్నికల్లో కొన్ని వర్గాల ఓట్లు గుంపగొత్తగా పొంది తమ పార్టీ గెలిచి అధికారంలోకి రావడం కోసం నాయకులు చేసిన వాగ్దానాలవి... కొన్ని వర్గాలకు చేసిన వాగ్దానాలను నెరవేర్చాల్సిన నైతిక ధర్మం వారి కుంది. అలా నెరవేర్చడానికి – ఎవరి అనుమతులూ అక్కర్లేకుండా – వారి వారి పార్టీ ఫండ్ నుంచి ఖర్చు చేయాలిగానీ 'టాక్స్ పేయర్స్ మనీ' నుంచి కాదు. అలా చేసిననాడు ఇప్పుడే కాదు రాబోయే ఎన్నికల్లో కూడా ఆ వర్గాల ఓటర్లను తమ వెంట తప్పనిసరిగా నడిచేలా చేసుకోగలరు... మళ్లీ అధికారంలోకి రాగలరు.

అందుకేగదా ఈ తిప్పలన్నీనూ!

✪ ✪ ✪

**మొ**న్న మొన్నటి దాకా ఎన్నికల హోరులో, ఎడా పెడా నాయకుల వాగ్దానాల ఉక్కపోతలో ఉక్కిరిబిక్కిరై శోషిల్లిన సగటు మనిషి... గత కొన్ని దశాబ్దాలలోనూ కానరాని ఈ ఎండాకాలపు ఎండలకు తల్లడిల్లిపోతున్నాడు. కరెంటు కోతలు, నీళ్ల కరువు లకుతోడు తగలబడిపోతున్న ఎండలకి జనం వందల సంఖ్యలో పిట్టల్లా రాలిపోతున్నారు. ఇక పిట్టలు కూడా పిట్టల్లా రాలి పోతున్నా వాటి గణాంకాలను ఏ నాయకుడూ పట్టించుకోడు.

ఎందుకు?... వాటికి ఓటు హక్కు లేదు కాబట్టి!!!

✪ ✪ ✪

**అ**క్రమ కట్టడాలన్నవి అన్నిచోట్లా ఉన్నా అవి వామనావ తారం దాల్చింది మాత్రం జంట నగరాల్లోనే! గత రెండు రోజు లుగా వాటిని కూల్చి వేయడం జరిగింది.

మంచిదే! కానీ అందుకు కారకులైన వారి సంగతి మాత్రం కన్వీనియంట్‌గా మరిచిపోతారు.

ఈ కూల్చివేతల్లో కొన్ని వందలమంది అధికారులు, కార్మి కులు, యంత్రాలు పాల్గొన్నాయి. వాటి ఖర్చు అంతా 'టాక్స్ పేయర్స్' భరిస్తున్నారన్న మాట! ఎవరో కొందరు కబ్జాదారులు సంబంధిత అధికారుల అండదండలతో చేసిన అక్రమాలకు 'టాక్స్ పేయర్స్' ఎందుకు బలి కావాలి? కూల్చివేతల ఖర్చులను – అందులో పాల్గొన్నవారి జీతభత్యాలతోసహా – మదింపువేసి దాన్ని ఆయా కబ్జాదారుల నుంచీ, దానికి అమ్యామ్యాలు స్వీక రించి సహకరించిన ఉద్యోగుల నుంచీ ముక్కు పిండి మరీ వసూలు చేయాలి.

అప్పుడే 'జవాబుదారీతనం' అన్నదానికి అసలైన అర్థం!

సాక్ష్యాలు లేవన్న సాకుతో ఇలా చేయరన్న సంగతి సగటు మనిషికి తెలియంది కాదు. అయినా ఇలా జరిగితే బాగుండు నన్న చిరు ఆశ!

సాయి **260**


ఈ పత్రిక మీది! మీఅభిరుచుల మేరకు పత్రికను రూపొందించడం మా వంతు!! అభిమానించి ఆదరించడం మీ వంతు!!!

# ముందుమాట

## తాడిచెట్లు



**రా**మయ్యకి హరి, గిరి అని ఇద్దరు కొడుకులు. సీత అని ఓ కూతురు. రెండెకరాల పొలం సాగుచేసి ఎలాగో బ్రతుకీడుస్తున్నాడు. పిల్లలెదిగేక కూతురి పెళ్లికి ఎకరం భూమి చెల్లిపోయింది. కొడుకులాయనతో, 'నువ్వు విశ్రాంతి తీసుకో. ఇకమీదట వ్యవసాయం మేము చేస్తాం' అన్నారు. దానికాయన, 'నాయనలారా! నాకింకా ఓపిక ఉంది. ఉన్న ఒక్క ఎకరంమీదా వచ్చే ఆదాయం మనందరికీ చాలదు. మీరు పట్నం వెళ్లి డబ్బు సంపాదించుకురండి. అప్పుడు నేను విశ్రాంతి తీసుకుంటాను' అన్నాడు.

హరి, గిరి పట్నం బయల్దేరారు. దారిలో వారికి ఓ చెట్టు క్రింద కొసప్రాణంతో ఉన్న ఓ బైరాగి కనిపించాడు. బైరాగి వారితో, 'నాకు ఆవసానదశ వచ్చింది. నా దగ్గిరున్న రెండు మూలికలూ ఎవరికీ ఇవ్వకుండానే చచ్చిపోతానని బెంగపడ్డాను. సమయానికి మీరొచ్చారు. నాకెంతో సంతోషంగా ఉంది' అంటూ ఇద్దరికీ చెరో మూలికా ఇచ్చి, 'ఈ మూలికతో మీరు రోజుకొకసారి కోరినంత ధాన్యాన్నో, బంగారాన్నో పొందగలరు. వాటితో మంచి పనులు చేస్తూ కలకాలం హాయిగా బ్రతకండి. నా ఆత్మకు శాంతి కలుగుతుంది' అన్నాడు. అన్నదమ్ములిద్దరూ ఎంతో సంతోషించారు కానీ, ఆ మూలికల్ని దొంగలబారినుంచి కాపాడుకోవడం ఎలాగని బెంగపడ్డారు.

బైరాగి నవ్వి, 'ఈ మూలికల్ని మీనుంచి ఎవరూ కాజెయ్యలేరు. వీటి మహిమ గురించి వేరెవరికైనా చెప్పాలన్నా మీరు చెప్పలేరు. ఐతే మీరు మంచి పనులు చేసినంతకాలమే వీటికి మహిమ ఉంటుంది' అని హెచ్చరించి కన్ను మూశాడు.

హరి, గిరి తిరిగి స్వగ్రామం వెళ్లారు. మూలిక మహిమతో తమ స్థితిగతులు బాగు చేసుకోవడమేకాక గ్రామస్థులకీ సాయపడ్డారు. వాళ్లకి ఊళ్లో మంచి పేరొచ్చింది. కానీ మంచిపనులు చెయ్యడం మానేస్తే, మూలిక మహిమ పోతుందన్న బెంగ వారికుండేది.

ఒక రోజు వాళ్లింటికి ఓ పేద పండితుడు వచ్చాడు. హరి, గిరి ఆయనకు బండెడు ధాన్యమూ, పిడికిళ్లతో బంగారమూ ఇచ్చి సత్కరించారు. ఆయన ఎంతో సంతోషించి, 'ఇలాగే దానగుణంతో కలకాలం వర్ధిల్లండి' అని దీవించాడు.

హరి, గిరి వెంటనే ఆయనతో, 'పండితవర్యా! ఇక్కడుండి ఎంత కాలమని మంచి పనులు చెయ్యగలం? కలకాలం మంచి పనులు చెయ్యడానికి మంచి సలహా ఏదైనా ఉంటే చెప్పండి' అన్నారు.

పండితుడో క్షణం ఆలోచించి, 'మీలో ఒకరు రాజకీయాల్లో ప్రవేశించండి. ఒకరు భక్తి మార్గాన్ని అనుసరించండి' అని సలహా ఇచ్చాడు. అన్నదమ్ములకీ సలహా నచ్చింది. గిరి రాజకీయాల్నీ, హరి భక్తిమార్గాన్నీ ఎన్నుకున్నారు.

ఆ దేశంలో ప్రజలే ఐదేళ్లకొకసారి నాయకుల్ని ఎన్నుకునే సంప్రదాయముంది. ఎన్నుకోబడ్డ నాయకులు దేశం కోసం ఎన్ని మంచి పనులైనా, ఎంత కాలమైనా చెయ్యొచ్చు. అలా గిరి ప్రజానాయకుడై – దేశంలో అవసరంలో ఉన్నవారిని ఆదుకోసాగాడు. దేశం చాలా పెద్దది. పేదల సంఖ్య చాలా ఎక్కువ. అందుకని చాలాకాలమే మంచి పనులు చేయొచ్చని సంబరపడ్డాడు గిరి.

ఆ దేశంలో అంతా అతిగా నమ్మే జగన్మోహనుడి ఆలయముంది. దైవ సందర్శనార్థం రోజూ లక్షలాదిగా భక్తులు వచ్చిపోతూంటారు. ఆలయానికొచ్చే ఆదాయంతో ఎన్నో విద్యాసంస్థలు, ఆశ్రమాలు నడుస్తున్నాయి. హరి రోజూ ఆ ఆలయం హుండీలో పిడికెడు బంగారం వేసేవాడు. భక్తులకి ఉచిత వసతి, భోజనాలు ఏర్పాటు చేశాడు. ఆ దేవుడి కెంత డబ్బొచ్చినా తగిన ఖర్చు ఉండనే ఉంది. భక్తుల కెన్ని సౌకర్యాలున్నా ఇంకా అవసరపడుతున్నాయి. అందుకని చాలాకాలమే మంచి పనులు చేయొచ్చని సంబరపడ్డాడు హరి.

కొన్నాళ్లిలా జరిగేక తమ గురించి జనం ఏమనుకుంటున్నారోనని హరికీ, గిరికీ కుతూహలం పుట్టింది. వారు మారువేషాల్లో దేశసంచారం చేసి తెలుసుకున్న నిజానికి నివ్వెరపోయారు. జనం తమని మహా అవినీతిపరులనుకుంటున్నారు.

నిజానికి తమలో అవినీతి ఉంటే ఈపాటికే తమ మూలికలకు మహిమ పోయి ఉండాలి. కానీ ఈ విషయం ఎవరికీ చెప్పలేరు.

చివరికి వారు తమకి సలహా ఇచ్చిన పండితుణ్ణి వెదికి పట్టుకుని, 'ఆర్యా! మీరు చెప్పినట్లే చేశాం. కానీ ఏ తప్పూ చెయ్యకపోయినా మాకు చెడ్డ పేరొచ్చింది. ఇకమీదట రాజకీయాలనుంచీ, భక్తిమార్గంనుంచీ తప్పుకుంటాం. మరేదైనా సలహా ఇవ్వండి' అన్నారు.

పండితుడు నవ్వి, 'ఇప్పుడా రెండు మార్గాల్లోనూ ఉన్నవారిలో అధిక సంఖ్యాకులు అవినీతిపరులు. తాడిచెట్టుకింద పాలు తాగినా కల్లు తాగారనే అంటారు కదా! ఆదే మీ విషయంలోనూ జరిగింది. కానీ మీరు తాగేవి పాలే ఐనప్పుడు మీకెందుకూ బాధ! కొన్నాళ్లకు మీవంటివారి సంఖ్య పెరిగి, ఆ

మార్గాలకు మంచి పేరొచ్చినా రావచ్చు. మీ ప్రయత్నం మానొద్దు' అని వెళ్లిపోయాడు....

– వసుంధర

# ఉత్తరాలు

వి.ఎ.కె. రంగారావు, చెన్నై

...మల్లాది రామకృష్ణశాస్త్రిగారి 'వినవేడుక'– చదివిన వెంటనే మళ్లీ మళ్లీ చదవాలనిపించే కథ. వందేళ్ల క్రిందట బందరులో, గొల్లవాడలో కృష్ణాష్టమి కోలాహలానికి అత్తరు, మెత్తదనం అద్దిన అద్దమది. చిన్ననాటి విషయాలు గుర్తు తెచ్చుకొన్న ఆర్ద్ర హృదయమది. వారిదే మరో కథ 'వనమాలిలో'– ఎవరే మాటన్నారో పూర్తిగా అర్థం చేసుకొని మనసులో హత్తించుకోవడానికి – మళ్లీ మళ్లీ చదవాలి. ఇక కొన్ని చదివిన తర్వాత, ఇవి నిజంగా జరిగితే ఎంత బాగుణ్ణనిపిస్తుంది. కథ పేరు గుర్తు లేదు కానీ – ఏనాడో మాలతీ చందూర్ ఓ కథలో తన కాన్వెంట్ టీచర్ గురించి, ఆమె వాడిన సెంటు గురించి వ్రాసారు. ఆ చిన్నపిల్ల చిన్ని మనసు అప్పుడప్పుడు తలవకుండానే గుబాళిస్తుంది. మే 'రచన'లో 'క్షీరసాగరం' అలాంటిది. కొన్ని కథలు మళ్లీ చదవాలనిపించదు. అంతమాత్రాన అవి చెత్తవని కాదు. మనిషిలోని దుర్మార్గానికి (పాశవికత్వం కాదు – పశువులలా ప్రవర్తించవు) – అవి నిలువెత్తు కర్కశ దర్పణాలు కనుక. మే 'రచన'లో 'ఇలాగే బతకాలేమో' ఆ కోవకు చెందింది. మొదట మోసగాడు మోహన్ మీద వచ్చిన కోపం క్రమేణా సుగుణారావు మీదకు, అతని బలహీనతపైకి బట్వాడా ఔతుంది. నేనూ మనిషినే, నాలోనూ ఎక్కడో అలాంటి రాక్షసత్వం దాగి ఉందా అన్న భయం వేస్తుంది. కొన్నింటిని రెండుమూడు మార్లు ఇష్టంగా చదివిన తరువాత మళ్లీ చదవాలనిపించదు. తీపి జ్ఞాపకాల దంతపు పెట్టెలో, మఖమల్ మెత్తదనంలో బయటికి తీయకుండా అలాగే భద్రపరచుకోవాలనిపిస్తుంది. 'మిథునం' (రచయిత?) అలాంటిది...

**✪ మీ ఉత్తరంలో మంచి కథల పరిచయం, విశ్లేషణ – భావుకతతో నిండి అలరించాయి. 'మిథునం' రచయిత 'శ్రీరమణ'.**

...చదివిన కథలకు రత్నపరీక్ష పెట్టడం నా చేతకాదు. ఆబగా రుచి చూసి, ఇతరులతో చెప్పి ఆనందింపచెయ్యడం చేతవును. మదిలోనున్న శారదాదేవికి చాలదా ఈ పూజ...

**✪ మీ పూజ వర్ధిల్లాలి!**

డా. శివభూషణం, కర్నూలు

...మే 'రచన'లో 'అపాత్రదానం' నేటి సమాజంలో మధ్యతరగతి మనోవికాసంలో మార్పుకి అద్దం పట్టింది...

**✪ ఉపకారగుణమున్నవారికి విచక్షణనూ, సాయపడకుండా తప్పించుకునేందుకు సాకులు వెదికే వారికి దానగుణాన్నీ – ఏకకాలంలో ప్రబోధించే అరుదైన ప్రయోజనాత్మక కథ అది. మీరు మీ అభినందనను నేరుగా రచయితకు తెలియజెయ్యండి.**

ఎ.వి. సోమయాజులు, కాకినాడ

...మే 4, ఆదివారం ఆంధ్రభూమిలో వచ్చిన మీ 'ఎలుక మెడలో గంట' కథ పేరుతో మొదలై – ప్రతి వాక్యం బాగుంది. నేటి నాయకుల సైకాలజీని స్పష్టం చేశారు – 'ఆడపిల్లలంతా ఒక్కటైతే వరకట్నానికి స్వస్తి. కుటుంబ నియంత్రణ, మద్యనిషేధం పాటిస్తే – పేదరికం హుష్ కాకీ. సభికుల సంఖ్యకీ, ఆహ్వానితుల రాకకీ ప్రాధాన్యమివ్వకపోతే ఇండియన్ పంక్చ్యుయాలిటీ ఎక్స్‌ట్రార్డినరీ. అవసరాన్ని కాస్త త్యాగం చెయ్యగలిగితే అవినీతికి దేవిడిమన్నా. ఇది కొత్తగా కనిపెట్టిందేంకాదు. ఇప్పటికే చాలామంది చెప్పి, 'పిల్లి మెడలో గంట కట్టేదెవరు?' అని కప్పదాటు వేసేస్తున్నారు. ఐతే నిజానికిది 'ఎలుక మెడలో గంట' కట్టడమని తేల్చేశాడు పరమానందం'. అదెలాగో చెప్పడానికి మీరు ప్రతి వాక్యానికీ జీవం పోశారు...

**✪ మాటల్నిబట్టి నేతల్ని అర్థం చేసుకునే స్థాయికి మన పౌరులెదిగారని – ఇటీవలి ఎన్నికల ఫలితాలు చెబుతున్నాయి. కథలు చదివి సమాజాన్ని అర్థం చేసుకునే స్థాయికి వారు ఎదిగే రోజు కూడా త్వరలో రానున్నదని ఆశిద్దాం. మీ అభిమానానికీ, పరిశీలనకూ ధన్యవాదాలు.**

ఎస్. రాజేంద్రప్రసాద్, వరంగల్

...మీ 'అపన' కథలు, నవలలు నాకెంతో ఇష్టం. ఇటీవల మీ డిటెక్టివ్ వెంకన్న కథల పుస్తకాలు రెండు చదివాను. అలాంటివి ఇంకా ఇంకా వ్రాయండి...

**✪ అప్పట్లో 'అపన' మాసపత్రిక మాచేత అలాంటి కథలు అడిగి వ్రాయించుకోవడంవల్ల క్రమం తప్పకుండా వ్రాసేవాళ్లం. మావద్ద అలాంటి ఇతివృత్తాలు అసంఖ్యాకంగా ఉన్నా – ఇప్పుడా తరహా పత్రికలు లేవు. మీ అభిమానానికి ధన్యవాదాలు.**

## టూకీగా

**జూ**న్ (2014) 'రచన'లో 9 కథలున్నాయి. ఉమ్మడి కుటుంబాల పునరుద్ధరణకు సహకరించగల **ముఖపుస్తకం**గా – ఇంటర్నెట్లో ఫేస్‌బుక్ – శ్రీ గాడేపల్లి వెంకటశాస్త్రి శత జయంతి పురస్కార వ్యంగ్య–హాస్య కథల పోటీలో బహుమతి అందుకుంది. ఎదగాలన్న తాపత్రయంలో ఎదగడానికి చేయూత

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

# అమ్మా... నువ్వెప్పుడొస్తావు?

కొన్ని అనుబంధాలు కేవలం ఆభరణాలు.
ఉన్నంతసేపూ విలువనిచ్చినా లేనప్పుడే స్వేచ్ఛనిస్తాయి!
– వసుంధర

కథాపీఠం

"**అ**త్తయ్యగారేరీ?" అంది లహరి, గుమ్మం బయట చెప్పులు విడిచి మొహం వ్రేళ్ళాడేసుకుని ఇంట్లోకి అడుగు పెట్టిన ఆదిత్యను ఉద్దేశించి.

ఆమె వైపు ఓసారి చూసి, "రానంది లహరీ.. తనక్కడే ఉంటానంది" అన్నాడు ఆదిత్య.

అతడి కంఠంలో ధ్వనించిన నిస్సహాయతా, దీనత్వం ఆమెను కలవరపెట్టాయి.

"అదేం? అయినా అక్కడ ఎవరున్నారని? మావయ్యగారున్నప్పుడైతే ఆయన కోసం ఉండిపోయార్లే అని సరిపెట్టుకోవచ్చు. పెద్ద వయసులో ఆవిడకేదైనా తేడాచేస్తే చూసేవారెవరున్నారక్కడ? పిల్లలు కూడా ఉదయం స్కూల్‌కు వెళ్ళేటప్పుడు 'అమ్మా.. మేం స్కూల్ నుంచి తిరిగొచ్చేసరికి నాన్నగారు బామ్మను తీసుకొచ్చేస్తారు కదా!' అంటూ సంబరంగా వెళ్ళారు. అత్తయ్యగారికిక్కడ ఇబ్బందిగా ఉండకూడదని ప్రత్యేకంగా ఓ గది కూడా కేటాయించి కావల్సిన ఏర్పాట్లన్నీ చేశానా గదిలో" – తనలో తాను చెప్పుకుంటున్నట్టుగా అంది లహరి బాధగా.

"నిజమే లహరీ! అన్నివిధాలా చెప్పి చూశాను. నేనెన్ని సార్లు ఎన్నివిధాల చెప్పినా తను చివరికి 'ఈ కట్టె ఇక్కడే కాలిపోనివ్వరాబ్బాయ్!' అనే సమాధానం చెప్పింది. అక్కడ మన ఇరుగుపొరుగు వాళ్ళు కూడా 'ఈ వయసులో నీ వంట నువ్వు వండుకుంటూ, తుమ్ముతూ, దగ్గుతూ ఇక్కడెందుకుంటావు? హాయిగా కొడుకు దగ్గరకెళ్ళి, మనవళ్ళ ఆలనా పాలనా చూసుకుంటూ, కోడలితో సేవ చేయించుకుంటూ సుఖంగా ఉండ'మని పలువిధాల చెప్పి చూశారు.

'నా కొడుకు సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే! కోడలు సీతాదేవికి మారు రూపం. నా మనవలు బంగారు బొమ్మలే! కాలు క్రింద పెట్టకుండా చూసుకుంటారు నన్నందరూ. అయినా సరే... నా కిక్కడే ఉండాలని ఉంది... వయసైపోయిందని మిమ్మల్నెవర్నీ ఇబ్బందిపెట్టనులెండి' అంది అమ్మ వారందరితో. కన్నకొడుకునై ఉండీ నేనే అమ్మను ఒప్పించలేకపోయినప్పుడు బయటి వాళ్ళు ఎంతకని తనకు నచ్చచెప్పగలరు?" అన్నాడు ఆదిత్య బాధగా.

ఆ విషయం ఇంకా పొడిగిస్తే అసలే దిగులుగా ఉన్న మనిషి మరింత బెంబేలు పడిపోతాడని, "అత్తయ్యగారు రాకపోవడం మన దురదృష్టం. ప్రస్తుతానికి ఊరుకుని కొన్ని రోజులు పోయాక ప్రయత్నించి చూద్దాం. అప్పటికి అత్తయ్యగారి ఆలోచనలో మార్పు రావచ్చు. సాయంత్రం పిల్లలు స్కూల్ నుంచి వచ్చేసరికి ఏదో కోల్పోయిన వాళ్ళలా ఇలా మొహాలు దీనంగా పెట్టుకుని ఉంటే వాళ్ళకు నచ్చచెప్పడం కష్టం!" అంటూ భర్తను అనునయించింది లహరి.

✪ ✪ ✪

*"కన్నా...!*

*ఎలా ఉన్నావు? కోడలూ, మనవలూ అంతా కుశలమని తలుస్తాను. పిల్లలు బుద్ధిగా బడికి వెళ్తున్నారా? నా పిచ్చిగానీ.. వాళ్ళు నా మనవలు. వాళ్ళుగాక ఇంకెవరు బుద్ధిగా చదువుకుంటారు? లహరి ఎలా ఉంది? పాపం పిచ్చిపిల్ల.. నేనంటే ఎంతో ఆపేక్షదానికి. అక్కడికి రానని, నేనిక్కడే ఉంటానని తెలిసి ఎంత బాధపడిందో! తన్నెలా సముదాయించావో పాపం!*

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*

సీతా సత్య

బిరగో డియోప్ ఫ్రెంచిలో చెప్పిన

# ఆఫ్రికన్ కథలు

స్వేచ్ఛానుకరణ

**నవన శర్మ**

## 4. వెర్రి వెంగళాయి డియోపుడు

డియోప్ లందరు వెర్రివెంగళాయిలు కారు. కాని వెర్రివెంగళాయిలందరూ డియోపులే!

ఆ ఊరు పేరు వాలో.

అక్కడుండేవారు వొలాఫ్‌లు. వాళ్లందరికి పై విషయం తెలుసు.

మోర్‌కోకి డియోపుడు ఒక గొప్ప మహ్మదీయ మతపెద్ద. అతను నమ్మకాలను రెండుగా విభజిస్తాడు. ఇస్లాం మతం పుట్టక ముందు నుంచీ ఉన్నవి, ఆ తరువాత ఏర్పడినవీ అని. అంతకు ముందు నుంచీ ఉన్నవి మూఢనమ్మకాలని వాటి మీద కాలం వ్యర్థపరచరాదని అతనికి తెలుసు.

ఇతనికి ఎంతోమంది శిష్యులు. అందులో ఒకడు గొప్ప శిష్యుడు. అతనికి పెక్కుమంది కూతుళ్లు. అందరిలోకి చిన్న కూతురు అందమైనది అమాయకమైనది. ఆమెను ఆ శిష్యుడు తన గురువైన డియోపుడి కిచ్చి వివాహం చేసాడు, కన్యాశుల్కం తీసుకోకుండా.

డియోపుడికి, ఈ శిష్యుడి కూతురు చిన్న భార్య. అతి కష్టం మీద డియోపుడు ఆమె ద్వారా ఒక కొడుకుని కన్నాడు. అతని పేరు మౌస్స డియోపుడు. అతను పరమ వెర్రివెంగళాయిగా పేరు తెచ్చుకొన్నాడు. అతన్ని అందరు 'వెవె' అని పిలిచేవారు.

ముసలి తండ్రి చనిపోయేనాటికి వెవె చిన్నవాడు. ఇంకా చిన్నతనం వదలని వాడు. అతనికి సవితి అన్నగార్లు ముగ్గురు. పెద్ద డియోపుడు, చిన్న డియోపుడు, బుచ్చి డియోపుడు, వారి పేర్లు. వాళ్లకి పెళ్లిళ్లయి కాపురాలు చేసుకొంటున్నారు. తండ్రి చనిపోగానే వారు ఆస్తులు వాటాలు వేసారు. వెవెకి ఒక కుక్కని వాటాగా ఇచ్చి, చచ్చిన ఆవు నివ్వనందుకు సంతోషించమన్నారు.

అది వాళ్లు చెప్పాలా? వెవెకే తెలుసు. అతను అన్నింటికి సంతోషిస్తూనే ఉంటాడు. ఆఖరికి తండ్రి చనిపోయినందుకు కూడా!

చచ్చినవాడు గొప్పవాడు. గొప్పవాడి కర్మ గొప్ప ఖర్చుతో కూడిన పని. గొప్ప విందులతో కూడినది. ఆ విందులకి అన్నలు పెద్ద, చిన్న, బుచ్చి ఇంట్లో ఒక్క వాటిలో వేటినో ఒకదాన్ని అమ్ముతూ వస్తున్నారు. వెవె తన తండ్రి కర్మకి తను కూడా తన కుక్కని బజార్లో అమ్మి ఖర్చుపెట్టాలని అనుకొన్నాడు.

కాలికి తాడు కట్టి తీసుకువెళ్తూ, ఎండకి తట్టుకోలేక ఊరికి దూరంగా ఉన్న చింత చెట్టు నీడలో కూర్చున్నాడు. ఇంతలో గాలి దుమారం లేచింది. చింత కొమ్మలుగా గాలికి కదులుతూ 'పుక్ పుక్ (పది, పది)' అనసాగాయి.

ఆ చెట్టు తన కుక్కకి పది నాణాలు విలువ కట్టిందని వెవె అనుకొన్నాడు.

"పదా? ఇంత మంచి కుక్కకి పదా? నేనేం వెర్రివాడిననుకుంటున్నావా? నేను తెలివైన డియోపుల వంశం వాడిని" అన్నాడు.

చింత చెట్టు మాట మార్చక 'పుక్, పుక్' అనసాగింది.

"ఈ రాత్రికి ఈ కుక్కని నీ దగ్గరే వదిలి వెళ్తాను. రాత్రంతా ఆలోచించుకో. రేపు తిరిగి వస్తాను. అప్పుడు మరో మాట చెప్పాలి సుమా!" అంటూ వెవె ఆ కుక్కని అక్కడ చెట్టుకు కట్టి, వదిలిపెట్టి, తల్లి దగ్గరకు వెళ్లిపోయాడు.

మర్నాడు వెవె చింతచెట్టు దగ్గరకి వెళ్లి చూస్తే కుక్క లేదు. బొమికెలున్నాయి. కట్టేసిన ఆ కుక్కని నక్కలు, దుమ్ములగొండ్లు, రాబందులు పీక్కు తినేసాయి.

"నా కుక్కకి వెల చెల్లించుకుండా దాన్ని పొట్టన పెట్టు కొంటావా? అన్నా" అంటూ వెవె ఇంటికి వెళ్లి గొడ్డలి తెచ్చి చెట్టును మొదలంటా నరికి వేసాడు.

చెట్టు కూలిపోయింది. ఆశ్చర్యం! దాని మొదట్లో ఎవరో ఎప్పుడో దాచుకొన్న – బంగారం, వెండి – నాణాలు బయట పడ్డాయి. దాంతో వెవె ఇంటికి పరిగెత్తుకు వెళ్లాడు.

"కుక్క ఏదిరా?" అని అడిగారు అన్నలు.

"చింత చెట్టుకి అమ్మేసాను. కాని అది వెల చెల్లించ కుండా దాన్ని తినేసింది. కోపంతో దాన్ని నరికి వేసాను. అప్పుడుగాని అది తన పొట్టలోని డబ్బుని బయట పెట్టలేదు. మనం వెళ్లి ఆ డబ్బు తెచ్చుకోవాలి" అన్నాడు వెవె.

అడగ్గా అడగ్గా అసలు విషయం అన్నలకి బోధపడింది. వాళ్లు చీకటి పడే వరకు ఆగి ఆ సంపద గాడిద మీద ఇంటికి చేరవేసారు.

ఆ డబ్బుని ఎక్కడ దాచాలా అని అన్నలు తలలు బద్దలు కొట్టుకొంటుంటే, మరుగుదొడ్డిని దొంగలు దోచుకోరు అంటూ సలహా ఇచ్చి ఆశ్చర్యపరిచాడు వెవె.

అన్నలా సొమ్ముని తమ్ముడి సాయంతో అక్కడే పదిలంగా దాచారు. డబ్బు కంపు కొడ్తుందని ఎంత తెలివైన దొంగ కూడా ఊహించడు కదా!

ఆ దేశపు రాజు అందరి రాజుల్లాగానే దేవుడిని కాక తనని, తనని నమ్ముకున్న వాళ్లని నమ్మేరకం. మోర్‌కోకి డియోపుడు రాజుకి ఆంతరంగికుడు. అతను మరణించిన ప్పుడు, రాజు డియోపుడి భార్యలని, సంతానాన్ని కలిసి తన సంతాపం తెలియచేయాలి కదా!

ఆ రాజు బయల్దేర్తుంటే అతని అంగరక్షకుడు నార్ అనే మూరు జాతివాడు కూడా అతన్తో బయల్దేరాడు. నార్‌కి నల్లవాళ్ల దేశంలో మరీ ఎక్కువ కాలం గడపటంలో ఆరోగ్యం పాడైంది. అది ఒంటె పాలతో కాని నయం కాదు. ఒంటె పాలు కావాలంటే తన దేశం వెళ్లాలి. రాజు, నార్‌కి అను మతి ఇచ్చాడు. అందుచేత రాజు పరామర్శకి, డియోప్‌ల గృహానికి వెళ్లినప్పుడు, నార్ లేడు.

అక్కడ రాజు మూడు రోజులు గడిపాడు. ఆ దినాల్లో తన పాలనలో ఉన్న ఉత్తర ప్రాంతీయులు కొందరు తమకి రాజు ముఖం గుర్తుండటం లేదని, చూసి చాలా సంవత్స రాలు కావటమే కారణం అని కబురు పెట్టారు. అందుకని రాజు అటువైపు వెళ్లి ఔత్తరాహికులకి తన ముఖం చూపించి తిరుగు ప్రయాణంలో తిరిగి డియోపుల ఆతిథ్యం స్వీక రిస్తానని చెప్పాడు.

రాజు వచ్చినప్పుడు డియోపులు రాజుకి ప్రముఖులకి ఇచ్చిన విందులు, తెగేసిన పశువులని చూసి అక్కడి జనాలు ఆశ్చర్యపోయారు, 'వీరింత ఐశ్వర్యవంతులా!' అంటూ.

నార్ ఆరోగ్యం బాగుపరుచుకొని, డియోపుల ఊరికి వచ్చి రాజు రాక కోసం, వారింట్లో ఉండి ఎదురు చూస్తానని చెప్పాడు. అక్కడ అతనికి గొప్ప ఆతిథ్యం లభించింది. అంత ఆతిథ్యం అతనికి రాజు వద్ద కూడా లభించలేదు. ఆ మాటే అతను డియోపులతోను అన్నాడు.

అన్నలు, "ఏదో! మీ అభిమానం వలన మీరంటున్నారు రాజుగారి ఆతిథ్యం ఎక్కడ? సామాన్యులమైన మా ఆతిథ్యం ఎక్కడ?" అన్నారు వినయంగా.

వెవె, "మేము ఈపాటి ఆతిథ్యం ఇచ్చామంటే అదంతా చింత చెట్టు చలవ. ఒక కుక్కకి ఆ చెట్టు అంత ధర చెల్లిస్తుం దని మేమెవరం అనుకోలేదు" అన్నాడు.

ఇది బుచ్చి విన్నాడు. విని మిగిలిన అన్నలను దూరంగా తీసుకువెళ్లి, "వెవె మన కొంప ముంచాడు. భూమిలో దొరి కిన సొత్తు, రాజుకి కదా చెందాలి. రాజు వెనక్కి వచ్చేవరకు, నార్ ఏమీ తెలియనట్టుండి రాజుకి చెప్తాడు. రాజు ఆ సంపదని పట్టుకుపోతాడు. అందుకని ఈ నార్‌ని మనం చంపేయాలి. ఊరు వారెవరూ ఇతన్ని చూడలేదు. చూసినా ఎవరో పొరుగూరు వాడు వచ్చి వెళ్లాడనే అనుకుంటారు" అన్నాడు.

అన్నలిద్దరు బుచ్చితో ఏకీభవించారు.

"అయితే చంపాక నార్‌ని ఎక్కడ పాతిపెడ్తాం?" అని అడిగాడు పెద్ద.

"డబ్బు దాచిన మరుగుదొడ్డిలో డబ్బుని తీసేసి నార్‌ని పాతిపెడ్దాం. ఇది వెవెకి తెలియనివ్వద్దు. మిగతా విషయం నాకు వదిలెయ్యండి" అన్నాడు చిన్నా.


నార్‌ని చంపడం అయింది. అనుకున్నట్టు మరుగు దొడ్డిలో పాతిపెట్టడం అయింది.

అనుకోకుండా అయింది, ఆ విషయాన్ని వెవె చూడటం.

చిన్న అన్న ఆలోచనలో పడ్డాడు.

మర్నాడు ఉత్తర ప్రాంతాలకి వెళ్లిన రాజు ఊర్లో అడుగు పెట్టాడు.

వెవె రాజుకు ఎదురు పరిగెత్తుకి వెళ్లి, వాడి అన్నలు రాజుగారి మనిషిని చంపి పాతిపెట్టారని చెప్పాడు.




"నార్ వాళ్ల దేశం వెళ్లాడు. మీ ఊరు కింకా రాలేదు. మిగిలిన వాళ్లంతా నాతోనే ఉన్నారు" అన్నాడు రాజు.

"అయితే అతను నార్‌యే కాబోలు – మీరు ముందు వచ్చినప్పుడు మీతో రాలేదు. మొన్న మీరు లేనప్పుడు వచ్చాడు. నిన్న మా అన్నలు అతన్ని చంపి పాతిపెట్టారు" అన్నాడు వెవె.

"అయితే నార్ ఎల్లా ఉంటాడో చెప్పు" అన్నాడు రాజు.

"తెల్లగా మేక గడ్డం వేసుకొని ఉంటాడు" అన్నాడు వెవె.

పోలిక సరిపోయింది. రాజుకి అనుమానం వేసి అన్నలని పిలిపించి నిలదీసాడు.

"నార్‌ని చూడకపోతే వెవెకి నార్ ఎల్లా ఉంటాడో ఎల్లా తెలుస్తుంది?" అని అడిగాడు రాజు.

"మీరు పూర్వం వచ్చినప్పుడు మీ వాళ్లెవరో నార్‌ని వేళాకోళంగా వర్ణించి ఉంటారు" అన్నాడు చిన్న.

"నార్‌ని మీ అన్నలు ఎక్కడ పాతిపెట్టారు?" అని రాజు వెవెను అడిగాడు అనుమానంగా.

"మరుగుదొడ్డిలో" అని చెప్పాడు వెవె.

"అల్లాంటి పని మేమెందుకు చేస్తాం?" అన్నారు అన్నలు.

"తవ్వి చూపించండి. అక్కడ నార్ ఉన్నాడో లేదో నేను చూసి తేల్చుకొంటాను" అన్నాడు రాజు.

అన్నలకి తప్పింది కాదు.

వెవె చూపిన చోటులో తవ్వారు.

ఆశ్చర్యంగా అక్కడ గడ్డంతో ఒక తెల్లటి మేకపోతు పాతిపెట్టబడి ఉంది.

"దీన్ని చూసి మీ వెవె మా నార్ అనుకొన్నట్టున్నాడు" అన్నాడు రాజు నొచ్చుకుంటూ.

విశ్వసనీయులైన డియోపులపై అనుమానపడ్డందుకు సిగ్గుపడి రాజు విందులు కుడవకుండా రాజధానికి వెళ్లిపోయాడు పరివారంలో.

మేక వంటశాలకి చేరింది.

ధనం మరుగుదొడ్డి చేరింది.

ఎన్నాళ్లకి తిరిగి రాని నార్‌ని తలుచుకొని, 'ఇతగాడికి మరీ ఇంటిమీద ఇంత బెంగుంటుందనుకోలేదు' అని సర్ది చెప్పుకొన్నాడు రాజు.

వెవెని ఊళ్లో వాళ్లు మేక గడ్డానికి, మనిషి గడ్డానికి తేడా తెలియని పరమ మూర్ఖుడు అని అనుకోసాగారు.

అందరు డియోపులు పరమ మూర్ఖులు కారు.

కాని పరమ మూర్ఖుడు మాత్రం ఖచ్చితంగా మౌస్స *డియోపుడే!*

✪

# రావి శాస్త్రి గారి కథలు నాలుగు

ప్రత్యేక రచన



**రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి జయంతి (జూలై 30) సందర్భంగా....**

**రా**వి చెట్టు వేరు చర్మ వ్యాధులకి మంచిది. రావి చెట్టు కిందే బుద్ధుడు తపస్సు చేశాడు. అందుకే దాన్ని బోధి వృక్షం అని కూడా అంటారు.

రా.వి. శాస్త్రిగారి రచనలు సాహిత్యానికి బోధి వృక్షం లాంటివి. అవి అర్థం అవాలంటే నిజంగానే తపస్సు చెయ్యాలి. అంత పవర్‌ఫుల్‌గా ఎలా రాయగలిగేరు?

ఆయన డికెన్స్, షా, మపాసా, టాల్‌స్టాయ్, చెకోవ్ లాంటి మహా రచయితల సాహిత్యం ఔపోసన పట్టేశారు.

వాటితో పాటు అట్టడుగు మనుషుల జీవితాలు చదివేరు. జీవితాల భాష విన్నారు. ఎ.సి. గదిలో కూర్చుని దరిద్రం గురించి ఎప్పుడూ రాయలేదు.

వృత్తిరీత్యా క్రిమినల్ లాయరు.

దగా, మోసం, పోలీసులు, దొంగలు, దొంగ సాక్ష్యాలు క్షుణ్ణంగా తెలుసు.

ముఖ్యంగా ఆయనకి కోర్టులంటే ఎలాంటి అభిప్రాయం ఉందో 'న్యాయం' అన్న కథలో రాశేరు.

*గుప్పున సారా కంపు – కోర్టు*
*గొల్లున సంత గోల – కోర్టు*
*అబద్ధాలకి పాముల పుట్ట – కోర్టు*
*అనాథల ఆక్రందన, అసహాయుల ఆర్తనాదం*
*పేదల కన్నీటి జాలు, అదే మాయా కోర్టు*

అంతేకాదు. లాయర్లంటే కూడా అంతే అసహ్యం.

"లాయర్లంత స్కౌండ్రల్స్ మరొకరు భూప్రపంచంలో లేరు. పరమ ధూర్తులు. As a class, I hate them though I belong to them" అంటారు.

'కాదేదీ కవిత కనర్హం' అని శ్రీశ్రీ అంటే, 'కాదేదీ కథకి అనర్హం' అన్నారు శాస్త్రిగారు. ఎండ, వర్షం, నల్ల మేక, కోడిపెట్ట – ఇలా అన్నిటి మీదా రాశేరు. అతని కథలన్నీ చుట్టూ ఉన్న మనుషుల జీవితాల్లోంచి వచ్చేయి. ఆ జీవితాల్లోని దరిద్రంలోంచి వచ్చేయి. ఆ దరిద్రంలో ఉన్న భాష లోంచి వచ్చేయి.

తన దగ్గర కొచ్చే పార్టీలంతా అట్టడుగు ప్రజలే!

ఒకసారి ఒక ఆడ మనిషి వచ్చిందట.

"నీకు దిక్కెవరూ లేరా అమ్మా?" అనడిగేరు.

"దిక్కెవరున్నారు బాబూ! ధరణి 'భూ'దేవి... ఆపైన దేముడు. ఆయెనక నీలాంటి మా రాజులున్నారు" అందిట.

దాన్ని ఆయన తన కథలో వాడుకున్నారు.

'ధరణి' అన్న మాట ఆ చదువురాని పల్లెటూరి మనిషికి ఎలా వచ్చింది?

తమ ఆవేదనల్ని ఇతరులకి స్పష్టంగా చెప్పాలంటే బలమైన భాషే పుట్టుకొస్తుంది అంటారాయన.

శాస్త్రిగారి రచనల్లో వర్ణనలు ఎక్కువని ఒక విమర్శ ఉంది. దానికాయన సమాధానం – "ఔను! విషయ పరిపుష్టికి, భావతీవ్రతా సూచకంగా సమర్థంగా వర్ణిస్తే తప్పేవీ లేదు. చుట్టూ ఉన్న వాతావరణాన్ని పరిచయం చెయ్యడానికూడా వర్ణనలు అవసరమే" అంటారు.

అంతే! అవి మనల్ని కథలో రాబోయే సన్నివేశానికి సిద్ధం చేస్తాయి.

'న్యాయం' అన్న కథలో ఒక వేశ్య సిగ్గుని – "పగటివేళ మెరుపులా వికృతంగాను, అర్ధరాత్రి మెరుపులా భయంకరంగాను ఉందామె సిగ్గు" అన్నాడు.

సిగ్గుని ఇంతకంటే బాగా ఎవరూ చెప్పలేరు.

ఆమె ఎలా ఉంది?

వంట్లో ఊపిరి లేదు. ముఖంలో కళాకాంతుల్లేవు. మూడో తరగతి రైలు పెట్టెలో బొమ్మలా నలిగిపడి వాడిపో

*(మిగతా భాగం పత్రికలో చదవండి)*






Owned, Edited, Printed and Published by Y.V.S.R.S. Sai :: Phones : 2707 1500
Corporate Office Address : "YADLAPATI's HOME"; 1-9-286/2/P, Vidyanagar, Hyderabad - 500 044
Printed at Charita Impressions, 1-9-1126/B, Azamabad, Hyderabad - 500 020